

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## రాష్ట్ర అభివృద్ధి రొట్టెను పట్టుకున్న మంత్రి నారాయణ

**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త - వైద్యం** రొట్టెల పండుగ సందర్భంగా నెల్లూరు చెరువులోనే రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ రాష్ట్ర అభివృద్ధి రొట్టెను పట్టుకున్నారు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.



## శేష వాహనంలో విహరించిన ఆదిశంకరుడు



**కోవూరు, జూన్26 ప్రభాత వార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవ స్థానంలో బ్రహ్మో త్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు శేష వాహనంలో భక్తులకు దర్శన మి చ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బ రామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా కోవూరుగౌడ సంఘం వారు వ్యవ హరించారు.

## టూరిజం హబ్‌గా నెల్లూరు బారా షహిద్ దర్గాను తీర్చిదిద్దుతాం

- సుమారుగా 15 లక్షల మంది భక్తుల అంచనా
- స్వర్ణాల చెరువులో నీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి
- 6315 మంది మున్సిపల్ శాఖ సిబ్బంది, 1870 పోలీసులు, గజ ఈతగాళ్ళు, బోట్ షికారు కోసం 8 బొట్లు ఏర్పాటు









**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త - కలెక్టరేట్** 2014 - 19లో బారా షాహీద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తింపు ఇచ్చారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం బారా షాహిద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అభివృద్ధికి రొట్టెను పట్టుకున్న అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో **మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ** 412 సంవత్సరాల చరిత్ర ఉన్న బారా షహిద్ దర్గాలో భక్తులు పెరుగుతున్నారు. 2014లో 4 లక్షల మంది భక్తులు వచ్చేవారు, సరైన వసతులు ఉండేవి కావు. 2014లో ఇక్కడ వసతులు పూర్తగా పెంచాం, అభివృద్ధి చేసామన్నారు. ఈ సంవత్సరం సుమారుగా 15 లక్షల మంది రానున్నారని ఆయన తెలిపారు. టూరిజం హబ్‌గా నెల్లూరు బారా షహిద్ దర్గాను తీర్చిదిద్దుతున్నామని మంత్రి తెలిపారు. ఎంతో నమ్మకంతో దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు అని స్వర్ణాల చెరువులో నీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాం. 6315 మంది మున్సిపల్ శాఖ సిబ్బంది, 1870 పోలీసులు, గజ ఈతగాళ్ళు, బోట్ షికారు కోసం 8 బొట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుదూర ప్రాంతాల నుండి, రాష్ట్ర నలుమూలల నుండి దేశ విదేశాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాలు ఉన్నాయి. అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. ఈ 5 రోజుల పండుగ తర్వాత కూడా మరో 5 రోజులు భక్తులు వస్తూనే ఉంటారన్నారు. అపరిశుభ్రత లేకుండా ఇక్కడ పరిశుభ్రంగా ఉంచాలని కోరుకుంటున్నామన్నారు.

**ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ** గత 50 ఏళ్లుగా రొట్టెల పండుగ కార్యక్రమంలో పాల్గొంటూ ఉన్నాను. చాలా అద్భుతంగా ఏర్పాట్లు చేశారు. 2014 తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మంత్రి నారాయణ దర్గా అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. టూరిజం స్పాట్‌గా బారా షహిద్ దర్గాను తీర్చిదిద్దడం చాలా సంతోషంగా ఉంది. మంత్రి నారాయణ ఆధ్వర్యంలో చెరువుని ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నాను.

**వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ** కులమతాలకు అతీతంగా మతసమరస్యానికి ప్రతీకగా నెల్లూరులో రొట్టెల పండుగ జరిగుతుంది. 2014కి ముందు ఒకలా 2014 తర్వాత వేడుకగా ఈ పండుగ జరుగుతోందన్నారు. మంత్రిగా నారాయణ, మేయర్‌గా నేను ఉన్న సమయంలో దర్గా అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. అప్పట్లో మంత్రి నారాయణ సహకారంతో ఘాట్ లు నిర్మించాం, టాయిలెట్స్, షవర్లు ఏర్పాటు చేసాం. సిమెంట్ రోడ్లు, షెల్టర్లు నిర్మించాం. భక్తులకు చిన్న ఇబ్బంది జరగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసాం, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెంచామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అతిధులని ఆదరిద్దామని, వారికి సహకరిద్దాం 27వ తేదీ రాత్రి గంధమహోత్సవం జరుగుతుందన్నారు. భారీగా భక్తులు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సుజాత నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, రిటైల్ పండగ చైర్మన్ మునీర్ అహ్మద్, మైనారిటీ నాయకులు, సయ్యద్ షమీ తదితరులు పాల్గొన్నారు.

### బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ
## మొదటిరోజు కిక్కిరిసిన భక్తజనం





**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త - కలెక్టరేట్** మొదటి రోజు బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ సందల్ మాలీతో మొదలవుతుంది. 2026లో ఈ పండుగ జూన్ 26, శుక్రవారం నుంచి మొదలైంది.

**మొదటి రోజు కార్యక్రమం**

**సందల్ మాలీ స్రాందల్ మాలీ** దర్గాలోని 12 మంది వీరుల సమాధులకు ఔషధ లేపనం/గంధం పూస్తారు. ఇదే పండుగ ప్రారంభ వేడుక.

**స్వర్ణాల చెరువులో పుణ్యస్నానం, రొట్టెలు మార్చుకోవడం** భక్తులు చెరువులో స్నానం చేసి, తమ కోర్కెల రొట్టెలు తీసుకొని ఒకరికొకరు మార్చుకుంటారు. మొక్కు తీరినవాళ్లు తెచ్చిన రొట్టెను కొత్తగా మొక్కుకునే వాళ్లు తీసుకుంటారు దర్గా దర్శనం చేసుకొని 12 మంది వీరుల సమాధులకు మొక్కులు చెల్లించుకుంటారు.

**భక్తుల రొట్టెల రకాలు** మొదటి రోజు నుంచే కోరికను బట్టి రకరకాల రొట్టెలు దొరుకుతాయి. రోజీకి రొట్టె: ఉద్యోగం కోసం, రిజ్కి రొట్టె: ఆహారం/సంపద కోసం, షాదీ కి రొట్టె: పెళ్లి కోసం, సెహత్‌కి రొట్టె: ఆరోగ్యం కోసం ఇంకా సంతానం, విద్య, ధనం, వీసా రొట్టెలు కూడా ఉంటాయి

**జూన్ 26 శుక్రవారం** సందల్ మాలీ, జూన్ 27 శనివారం గంధ మహోత్సవం, జూన్ 28 ఆదివారం రొట్టెల పండుగ, మెయిన్ రోజు జూన్ 29 సోమవారం తహలీల్ ఫాతేహా, జూన్ 30 మంగళవారం ముగింపు.

**ఈ ఏడాది** 1416 లక్షల మంది వస్తారని అంచనా. భద్రత, శానిటేషన్, మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేశారు.

## రామాయపట్నం పోర్ట్ ప్రైవేటీకరణ తగదు

**- జిల్లా వైసీపీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి**



**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త-వైద్యం:** రామాయ పట్నం పోర్ట్ ప్రైవేటీకరణ తగదని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలో వున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి ప్రసాదించిన అత్యంత విలువైన అవకాశాల్లో పోర్టు ఆధారిత అభివృద్ధి ఒకటి అన్నారు. ఈ సామర్థ్యాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం అనే మూడు నాన్‌మేజర్ పోర్టుల అభివృద్ధిని వేగవంతం చేయడమే కాకుండా, వాటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణను కూడా విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే తన విధానంలో భాగంగా ఇప్పుడు రామాయపట్నం పోర్టును కూడా ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. అందుకోసం గురువారం విడుదల చేసిన జీవో ద్వారా డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్ఫర్ విధానంలో డెవలపర్ ఎంపిక కోసం ఆర్ఎఫ్‌పి విడుదలకు అనుమతి ఇచ్చిందన్నారు. ఈ నిర్ణయం పూర్తిగా అనుచితమైనదని, ఎందుకంటే 2024 ఫిబ్రవరిలోనే ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సమీకరణ పూర్తయిందని గుర్తు చేశారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.3,938.10 కోట్ల రుణాన్ని మంజూరు చేసిందని, అంతేకాకుండా, 2024 ఫిబ్రవరి 16న విడుదలైన జీవో నెం.6 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆ రుణానికి గ్యారంటీ కూడా ఇచ్చిందన్నారు. జీవో నెం.6లో ఈ పోర్టును ఓన్ ఆపరేషన్స్ మోడల్ లో నిర్వహించాలని స్పష్టంగా పేర్కొన్నారన్నారు. ఈ విధానం వల్ల ప్రాజెక్టు ఆర్థికంగా మరింత బలపడిందని తెలిపారు. ప్రభుత్వ ఈక్విటీ వాటా తక్కువగా ఉండటంతో, 80:20 రుణ-ఈక్విటీ నిష్పత్తిలో పిఎఫ్ సి నుంచి రుణం లభించిందని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.4,929 కోట్లు. ఇందులో పిఎఫ్ సి రుణం రూ.3,938.10 కోట్లు, ప్రభుత్వ ఈక్విటీ వాటా కేవలం రూ.991 కోట్లు మాత్రమే అన్నారు. ఈ మొత్తం ఆర్థిక నిర్మాణాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరారు చేసి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి టీడీపీ ప్రభుత్వానికి అప్పగించిందని తెలిపారు.

❖ ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కేవలం రూ.991 కోట్ల ఈక్విటీ కూడా పెట్టడానికి సిద్ధంగా లేకుండా, మళ్లీ ప్రైవేటు డెవలపర్‌ను ఆహ్వానించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఇప్పటికే ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తయిన ప్రాజెక్టుకు మళ్లీ డిజైన్, ఫైనాన్స్ పేరుతో డిబి ఎఫ్ ఓటి విధానంలో టెండర్లు పిలవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

❖ ప్రైవేటు సంస్థల ప్రధాన లక్ష్యం ప్రజా ప్రయోజనం కాదు, లాభార్జన మాత్రమే అన్నారు. ఉపాధి కల్పన, కార్గో వైవిధ్యకరణ, ప్రాంతీయ అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలు వంటి అంశాలకు అవి ప్రాధాన్యం ఇవ్వవన్నారు. దీనివల్ల భవిష్యత్తులో రాష్ట్రానికి భారీ ఆదాయం తీసుకురాగల బలమైన ప్రభుత్వ రంగ సంస్థను ఆంధ్రప్రదేశ్ కోల్పోయే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను కాపాడటానికి కాకుండా, ప్రైవేటు సంస్థలకు అప్పగించి కాంట్రాక్టుల ద్వారా అధికార పార్టీ పెద్దలకు ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకువచ్చిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రజల డబ్బుతో రూపుదిద్దుకున్న రామాయపట్నం పోర్టు ప్రజల ఆస్తి దానిని ప్రభుత్వ ఆధీనంలోనే పూర్తి చేసి, ప్రభుత్వ నిర్వహణలోనే అభివృద్ధి చేయాలని, రామాయపట్నం పోర్టును ప్రైవేటీకరించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## రొట్టెల పండగకు తొలిరోజు భక్తుల రద్దీ

- సుదూర ప్రాంతాల నుంచి భారీగా విచ్చేసిన భక్తులు
- పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర సేవలు
- పటిష్ట పోలీసు బందోబస్తు పక్కాగా ఏర్పాట్లు
- సంతృప్తి వ్యక్తం చేసిన భక్తులు
- ప్రశాంత వాతావరణంలో రొట్టెలు మార్చుకున్న భక్తులు





**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త-కలెక్టరేట్** నెల్లూరు బారాషహీద్ దర్గాలో ప్రారంభమైన రొట్టెల పండుగకు తొలి రోజు భక్తులు భారీగా తరలివచ్చారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల , ఎస్పీ అజిత వేజండ్ల, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం... కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

**పటిష్ట బందోబస్తు** దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సుమారు 1800 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్ అవుట్ పోస్ట్ ద్వారా అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు.

**పారిశుద్ధ్య సిబ్బంది సేవలు భేష్** దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి 6 వేలకు పైగా సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి.

**వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్‌ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మొదటిరోజు సుమారు 400 మంది పైగా భక్తులకు బిపి, రక్త పరీక్షలు, మందులు అందజేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు. ప్రత్యేకంగా ఆయుష్ వైద్య శిబిరం ప్రజలకు ఆయుష్, యునాని, హోమియో వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు రొట్టెల పండుగలో ప్రత్యేకంగా ఆయుష్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆయుష్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరాజు, సరళ హెబ్సిబా, జ్ఞాన ప్రసూన, వినోద్ బాబు వైద్య సేవలు అందించారు. సుమారు 500 మంది ఆయుష్ విభాగం సేవలను వినియోగించుకున్నారు.

**అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ** స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో 24 గంటలూ అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు. దర్గా ఆవరణలో అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు.

**భక్తులందరికీ అన్నదానం** రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచిత అన్నదానాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అందిస్తున్నారు. అలాగే భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని స్టాల్స్ ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు అందజేస్తున్నారు.

**ప్రత్యేకంగా మీడియా పాయింట్** రొట్టెల పండుగ కవరేజ్ నిమిత్తం దర్గాకు విచ్చేస్తున్న మీడియా వారికి ప్రత్యేకంగా జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో మీడియా పాయింట్ ను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. పాత్రికేయులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఈ కేంద్రం నుంచి తమ విధులు నిర్వహిస్తూ రొట్టెల పండుగ విశేషాలను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తున్నారు. మీడియా వారికి ప్రత్యేకంగా అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించారు.

## రేఖ రమేష్‌కు ఎల్‌ఓసి ద్వారా రూ.1,52,810 పత్రం అందజేసిన ఎమ్మెల్యే



**కావలి, జూన్ 26 ప్రభాతవార్త :** ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ మానవతా దృక్పదాన్ని చాటుతున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మరోసారి తన సేవాభావాన్ని నిరూపించారు. పట్టణంలోని 9వ వార్డుకు చెందిన శ్రీరేఖ రమేష్ తీవ్ర అనారోగ్యంతో బాదపడుతూ చెన్నలోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. వైద్యుల సూచనల మేరకు అత్యవసర చికిత్స అవసరమని తెలియడంతో చికిత్సల ఖర్చులను భరించే ఆర్థికస్థోమత లేక బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఆశ్రయించారు. వారి పరిస్తితిని తెలుసుకొన్న ఎమ్మెల్యే స్పందించి సిఎం నారా చంద్రబాబు ఆశీస్సులతో ఎల్‌ఓసిద్వారా రూ.1,52,810లు ఆర్థికసాయాన్ని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎల్‌ఓసి పత్రాన్ని టిడిపి కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. తమ కష్టాన్ని గుర్తించి స్పందించి ప్రభుత్వసాయం అందేలా కృషి చేసిన సిఎం నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. **ఎమ్మెల్యే మాట్లాడుతూ** ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సకాలంలో చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. పట్టణ అద్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రకియ పారదర్శకంగా ఉండాలి

**తహిసీల్దార్.కె.జయజయరావు**



**కోట, జూన్ 26 ప్రభాతవార్త** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ప్రక్రియను కోట మండలంలో తహిశీల్దార్ కె.జయజయరావు పరిశీలించారు. ఎస్ఐఆర్ లో భాగంగా ఓటర్ల నమోదు, ధృవీకరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శంతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోట మండల తహిసీల్దార్ కె.జయజయరావు కోరారు. ఆయన శుక్రవారం తన కార్యలయూంలో బిఎల్‌ఓలతో మాట్లాడారు. ముందుగా ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ( ఎస్ఐఆర్) ప్రక్రియను పర్యవేక్షించారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ వేగవతంగా చేసి మండలంలోని నమోదు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు బిఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లు వివరాలను ధృవీకరించడంతో పాటు ఎనోల్మెంట్ ఫారాలను తప్పనిసరిగా అందజేసి వాళ్లకు అర్థమయ్యేలా వివరించి ఫారాలను పూరించడంలో సహకరించాలన్నారు. 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుతం ఆగ్రుహాల్లో నివసిస్తున్న ఓటర్లు వివరాలను సరిపోల్చాలని వ్యక్తులు ఆఇంటిలో లేకపోతే వారు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారో గుర్తించి వివరాలను నమోదు చేయాలని సూచించారు.

## పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటిన హ్యాపీ సేవాసంస్థ



**కావలి, జూన్ 26 ప్రభాతవార్త :** పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్ సుధాకర్ సౌజన్యంతో ఇంజనీరింగ్ చదువుతున్న సంస్థ అధ్యక్షులు సయ్యద్ఘని బాషా కుమారుడు సయ్యద్ నౌషాద్ అలీ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించి కేక్కట్చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందసంస్థ గౌరవ అధ్యక్షులు ఎస్కె.బాష, రిటైర్డు హెచ్ఎం అజిత్బాబులు మాట్లాడారు. గిరిజన గురకుల పాఠశాలలో పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు గణిబాషా దాతల సహకారంతో చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జాగో సేవాసంస్థ షేక్.జమీర్ ప్రభాకర్, నాగరాజు, విజయ్ దేవరకొండ, చాన్బాషా, హజరత్తయ్య, హాఫీజ్ అలీ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెంగమాంబ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

**ఎమ్మెల్యే కాకర్ల సురేష్**



**దుత్తలూరు జూన్ 26 ప్రభాతవార్త :** నర్రవాడ వెంబమాంబ బ్రహ్మోత్సవాలను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ కోరారు. శుక్రవారం నర్రవాడలోని దేవస్ధాన కార్యాలయం ఆవరణంలో కావలి ఆర్డిఒ ఎలీషా అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే సురేష్ మాట్లాడుతు ప్రతి ఒక్కరు బ్రహ్మోత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని జయప్రదం చేయాలన్నారు. వెంబమాంబ దేవస్ధాన అభివృద్ధికి మొదట విడతగా 6 కోట్లు రూపాయాలు మంజూరు అయినట్లు ఆయన వివరించారు. అలాగే దుత్తలూరు మండలంలో వేలాది వేలాది కోట్ల రూపాయాలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని వెంగమాంబ దేవస్ధానం అభివృద్ధి జరుగుతుందని దీంతో దుత్తలూరు మండలం ప్రాముఖ్యత సంతరించుకుంటుందని తెలిపారు. వెంగమాంబ దేవస్ధానానికి రెండో విడతగా మరో ఆరు కోట్లు మంజూరు అవుతాయన్నారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యం ఎదురు కాకుండా పూర్తి స్ధాయి ఏర్పాట్లు చేయాలన్నారు. కావలి ఆర్డిఒ ఎలీషా మాట్లాడుతు అధికారులు తమకు కేటాయించిన విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, మంచినీరు ,విద్యుత్ ,రహదారులు,క్యూలైన్లు, వైద్య తదితర వాటిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వెంగమాంబ తిరునాల ప్రాశస్త్యం గలదని లక్షలాదిమంది భక్తులు నమ్మకంతో అమ్మవారిని చూడడానికి వస్తారని కాబట్టి అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు రాకూడదన్నారు. అధికారులు, వ్యవస్ధాపక ధర్మకర్తలు,ఒక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ఉత్సవాలనే విజయవంతం చేయాలన్నారు. అనంతరం అమ్మవారి బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఆలయ ప్రధాన వ్యవస్ధాపక ధర్మకర్త వేమూరి ముసలయ్య, ఆలయ ఈవో ఆళ్ళ శ్రీనివాసులరెడ్డి, వ్యవస్ధాపక ధర్మకర్త పచ్చవకరుణాకర్, ఉత్సవాల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## 1న శ్రీసీటికి సీఎం చంద్రబాబు రాక

కోట,జూన్ 26 ప్రభాతవార్త జూలై1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబానాయుడు శ్రీసిటిలోని హీరో మోటారు కార్ప్‌కు శంఖస్ధాపన చేయనున్నారు. ఆమేరకు శుక్రవారం తిరుపతి జిల్లాకలెక్టర్ డా.ఎస్.వెం కటేశ్వర్ ,ఎస్పి.సుబ్బారాయుడు కంపెనీ ప్రతిధినిదుల కలిసి ఏర్పాట్లు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

## విద్యుత్ సరఫరా అంతరాయం

**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త** 33/11కేవీ శెట్టిగుంట రోడ్డు సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ ఏఈ ఎం. శ్రీధర్ తెలిపారు. మధురా నగర్, ప్రశాంతి నగర్, వేణుగోపాల్ నగర్, సింహపురి కాలనీ, 3వ మైల్, కిసాన్ నగర్, రాజీవ్ గాంధీ కాలనీ, వెంగల్ రెడ్డి నగర్, సాధవారి పాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన తెలియజేసారు.

## ఎమ్మెల్యేను కలిసిన సిఐ రంగనాథ్‌గౌడ్



**కావలి, జూన్ 26 ప్రభాతవార్త :** ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఒకటవ పట్టణ సిఐ రంఘనాథ్‌గౌడ్ శుక్రవారం ఎమ్మెల్యే దుగమాటి వెంకటక్రిష్ణారెడ్డిని టిడిపి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం పట్టణంలోని ట్రాఫిక్, అసాంఘీక కార్యక్రమాలు, జూదాలు వంటివాటి పట్టణంలోని క్రైమ్‌లకు సంబంధించిన వాటిపై ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

## ఉదయగిరిలో ఘనంగా యౌమె ఆషురా



**ఉదయగిరి, జూన్ 26, ప్రభాతవార్త :** ఇస్లాం పునరుజ్జీవనానికి ప్రాణత్యాగం చేసిన ప్రవక్త మనవడు ఇమామే హుస్సేన్‌తో పాటు అమరులైన వారి త్యాగం మరవకూడదని ఉదయగిరి ఖాదరీయా ఆస్తానా అధ్యక్షుడు అహమద్ భాషా కాలిదీ పేర్కొన్నారు. మొహరం పదవ రోజు శుక్రవారం ఆస్తానా ఖాదరీయలో యౌమె అషురా గనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇస్లాం అమరత్వానికి ప్రాణ త్యాగం చేసిన 72మంది అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఖురాను పఠనం, అమరవీరులపై గీతాలాపనలు భక్తుల కంటనీరు తెప్పించాయి. ప్రత్యేక ప్రార్ధనలు అయ్యాక ప్రసాదం పంచారు. ఆస్తానాలో పది రోజులుగా పూజలందుకొంటున్న పీరును సాయంత్రం తీసిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకుడు రియాజ్, ఖాదరియా ఆస్తానా పెద్దలు మితాయిగిరి అహమద్, ఫరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన చిన్నారులు సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు

**– ఆర్ఎఫ్ఐడి ట్యాగ్‌లతో చిన్నారుల భద్రతకు పోలీసుల ప్రత్యేక చర్యలు**



**నెల్లూరు క్రైమ్ జూన్ 26, ప్రభాతవార్త :** నగరంలోని ప్రతిష్టాత్మక బారా షహీద్ దర్గా రొట్టెల పండుగసందర్భంగా భక్తుల భద్రత, సౌకర్యాల కోసం జిల్లా పోలీస్ శాఖ విస్తృత స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. బందోబస్తు మొదటి రోజున భక్తుల రద్దీ మధ్య వివిధ కారణాలతో తప్పిపోయిన 34 మంది చిన్నారులను పోలీసులు గుర్తించి, వారి తల్లిదండ్రులను ధృవీకరించి సురక్షితంగా అప్పగిం చారు. చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు సెక్టార్ పాయింట్ల వద్ద శిసీదీ ట్యాగింగ్ విధానాన్ని అమలు చేసి, తల్లిదం డ్రుల సమక్షంలో చిన్నారులకు ఈ రోజు 156 ఆర్ఎఫ్ఐడి ట్యాగ్‌లు ఏర్పాటు చేశారు. ఈ ట్యాగ్‌లను స్కాన్ చేయడం ద్వారా తప్పిపో యిన చిన్నారుల వివరాలను త్వరగా గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు చేరవేయడం సులభతరం అవుతుంది. అదేవిధంగా, బెంగుళూరుకు చెందిన ఒక మహిళ తన బ్యాగ్‌ను పోగొట్టుకోగా, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి బ్యాగ్‌ను గుర్తించారు. అందులో ఉన్న రూ.16,000 నగదుతో సహా బ్యాగ్‌ను తిరిగి బాధిత మహిళకు అందజేశారు. పోలీసుల తక్షణ స్పందనకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొంటున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల నిఘా, క్రైమ్ టీమ్స్, బాంబ్ డిస్పోజల్ టీమ్స్, డాగ్ స్క్వాడ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది. భక్తుల రక్షణ, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహణే పోలీసుల ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరిస్తూ, సూచించిన భద్రతా నియమాలను పాటించాలని కోరారు.

## వైభవంగా శ్రీ చాముండేశ్వరి దేవి అశ్వ వాహన సేవ



**ఇందుకూరుపేట, జూన్ 26, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నం గ్రామంలో వేంచేయున్న శ్రీ చాముండేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవారికి అశ్వ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అశ్వ వాహనంపై వేంచేపు చేసి, రంగురంగుల విశేష పుష్ప అలంకరణలతో, దేదీప్యమానమైన విద్యుత్ దీపాల నడుమ నయనమనోహరంగా అలంకరించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ అమ్మవారి గ్రామోత్సవాన్ని భక్తుల కోలాహలం మధ్య నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో విహరించిన చాముండేశ్వరి దేవికి భక్తులు ఇళ్ల వద్ద కర్పూర హారతులు పడుతూ, కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గుండాల కృష్ణారెడ్డి, కార్యనిర్వహణ అధికారి తాతా శ్రీనివాసరావు, ప్రముఖులు గుండాల మాధవరెడ్డి, బొద్దుకూరు సుధీర్, మారుబోయిన జనార్దన్ గౌడ్, ఆలయ అర్చకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బారాషాహీద్ దర్గా

## రొట్టెల పండుగ

## మొదటిరోజు

## కిక్కిరిసిన భక్తజనం





ఫోటోలు : నంద మాల్యాద్రి

## అధ్వానంగా ప్రైవేటు విద్యాసంస్థలు..పట్టింపులేని విద్యాశాఖ

**: నిబంధనలకు పాతర, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం : కొడవలూరు, విడవలూరు మండలాల్లో అధికారుల నిర్లక్ష్యం**

**కొడవలూరు,విడవలూరు జూన్ 26 ప్రభాతవార్త:**నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలు, నిబంధనలు పాటించని వాహనాలు, మౌలిక సదుపాయాలు లేని క్యాంపస్‌లు.. ఇదీ కొడవలూరు, విడవలూరు మండలాల్లోని ప్రైవేటు విద్యాసంస్థల ప్రస్తుత పరిస్థితి. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.అనుమతులకు మించి తరగతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలకు ఉండాల్సిన స్థలం, క్రీడా ప్రాంగణాలు, సౌకర్యాలు ఏవీ ఈ ప్రాంతంలోని చాలా పాఠశాలల్లో కనిపించడం లేదు. అనుమతి లేని అదనపు తరగతులు నిర్వహిస్తూ, దానికి తగ్గట్టుగా అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేకపోయినా.. విద్యాబోధన చేస్తున్నామని ప్రైవేటు యాజమాన్యాలు తల్లిదండ్రుల నుండి ఫీజుల రూపంలో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థుల బలి :** కొడవలూరు మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో, ఆ ప్రభావం విద్యార్థుల ఫలితాలపై పడింది. కనీస విద్యాబోధన లేక ఇద్దరు విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. విడవలూరు మండలంలో అయితే కనీస మౌలిక సదుపాయాలు లేని ఇళ్లల్లోనే పాఠశాలలు నడుపుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**పట్టించుకోని రవాణా తనిఖీలు :** పాఠశాల వాహనాల్లో సీట్ల సామర్థ్యానికి మించి చిన్నారులను తరలిస్తున్నా, ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్లపై తిరుగుతున్నా రవాణా, విద్యాశాఖ అధికారులు కనీసం స్పందించడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసినా, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకుండా.. ఫోన్ ద్వారానే విచారణ ముగించేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

**స్పందించాలి: తల్లిదండ్రులు :** క్షేత్రస్థాయిలో జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి కొడవలూరు, విడవలూరు మండలాల్లోని ప్రైవేటు విద్యాసంస్థలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కఠిన చర్యలు తీసుకుంటేనే యాజమాన్యాల్లో మార్పు వస్తుందని, లేనిపక్షంలో విద్యార్థుల జీవితాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరిస్తున్నారు.

## గ్రంధాలయ యాత్రకు గండికోట



**బుచ్చి జూన్ 26 ప్రభాతవార్త :** సమగ్ర జీవన వ్యక్తి వికాసం,స్వేచ్ఛాయుత ఆలోచనల ప్రపంచం, విలువల నిర్మాణానికి ప్రతి బింబంగా నలిలే గ్రంధాల యాలను సమాజానికి చేరువ చేస్తు గ్రంధా లయ వారోత్సవాలను నిర్వహిస్తు వేసవిలో విజ్ఞాన, వినోదాన్ని సంచుతున్న ఉపాధ్యా యులు, సామాజిక వేత్త గండికోట సుధీంకుమార్ గ్రందాలయాల సందర్శ యాత్రకు ఎంపికయ్యారు. విజయవాడలో ఈనెల 28న ఆదివారం నిర్వహిస్తున్న 110 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన విజయవాడ బుక్ పెస్టివల్ ,ఠాగూరు, రామ్మోహన్, హనుమం తరాయ సర్వోత్తమ గ్రంధాలయా యాత్రలో ఆయన పాల్గొని చరిత్ర సంస్కృతి పుస్తకాల అమరిక, నిర్మాణ శైలి,నిర్వహణ విదానాన్ని పరిశీలించనున్నారు. ఈ మహత్తర అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్‌పర్సన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆంధ్ర రచయిత సంఘం అద్యక్షులు చలపాక ప్రకాష్, కి ధన్యవాదాలు తెలిపారు.ఈ బస్సు యాత్రను ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ శ్రీ లక్ష్మీ ప్రారంబిస్తారని పేర్కున్నారు. గ్రంధాలయ యాత్రకు ఎంపికైన గండికోటను ,ఎంఇఒలు, దీలీప్ రత్నం ఉపాధ్యాయులు స్నేహితులు అభినందించారు

## యోమ్-ఏ- ఆషూరా



**ఉదయగిరి, జూన్ 26, ప్రభాతవార్త :** ఇది త్యాగం, ధైర్యం, సత్యాన్ని నిలబెట్టడానికి ప్రాణాలు అర్పించిన ఇమామ్ హుస్సే న్(అ.స) అండ్ కార్బలా షమీద వీర మరణాన్ని స్మరించుకొని అత్యంత పవిత్రమైన ఈ రోజు, ఈరోజు సయ్యదిన అబ్దుల్ ఖాదర్ ఖన్సా వాలి దర్గా యందు సయ్యద్. మన్సూర్ రోజ్దర్, దర్గా కమిటీ ఆధ్వర్యంలో యోమ్- ఏ- ఆశురా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం మన జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా హుస్సేన్ అలీషా ఖాదరీ(ఆస్థానే- చిష్తీయ) ఈ పర్వదినం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొహరం మాసంలో వచ్చే 10వ రోజు యోమ్- ఏ-ఆశురా అని అంటారని తెలిపారు. ఇది మానవ చరిత్రలో అనేక ప్రవక్తలకు అల్లాహ్ అనుగ్రహం లభించిందిన పవిత్రమైన రోజు అంతే కాక అన్యాయానికి వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేసిన ఇమామ్ హుస్సేన్(అ.స) తన కుటుంబ సభ్యులతో మొత్తం 72 మంది కలిసి అమరులు అయ్యారు. ఈ కార్యక్ర మంలో వచనాలను సత్యం కోసం పోరాటం నియంతృత్వం లేదా అన్యాయం ఎదుట ఎదురుగా నిలబడి నిజం చెప్పడమే అత్యుత్తమ సాహసం. ఇమాం హుస్సేన్(అ.స) అండ్ ఆత్మాభిమానం అవమానకరమైన జీవితం కంటే ఆత్మాభిమానంతో కూడిన మరణం ఎంతో మేలు ఇమాం హుస్సేన్(అ.స), కర్బలా చారిత్రాత్మక కథను వివరించారు. ఈ కార్యక్రమంలో అందరికి ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ మస్తాన్ హైదర్ అలీ సయ్యద్, హంజా హుస్సేనీ, షేక్ షబ్బీర్, తహెర్ అలీ హుస్సేనీ కలీం భాయ్ షేక్ గాజుల ఇలియస్ నాగూర్ ఖాదర్ వలి దర్గా భక్తుల ప్రతినిధి దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పీర్ల చావడి వద్ద అన్నదానం

**బిట్రగుంట జూన్ 26 ప్రభాతవార్త** ఇబ్రహీంపేట మదీనా వెల్డింగ్ షాప్ యజమాని ఎస్.కె హమీద్ ఆధ్వర్యంలో మొహరం సందర్భంగా శుక్రవారం పేదలకు అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎంఆర్ యువసేన అధ్యక్షులు సమీఉల్లా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మదీనా వెల్డింగ్ యుషాప్ యజమాని హమీద్ గత పది సంవత్సరాల నుంచి పేదలకు అన్నదానం చేయడం జరుగుతుందని పేదలకు అన్నదానం చేసిన హమీద్ కు కుటుంబ సభ్యులకి కృతజ్ఞతలు తెలిపారు. ఖాదర్ భాషా నయీం ఇబ్రహీం హుస్సేన్ మహీం సుజిత్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## రామస్వామిపల్లిలో రైతులకు అవగాహనా సదస్సు



**ఆత్మకూరు,జూన్26,ప్రభాతవార్త:** ఆత్మకూరు మం డలంలోని రామస్వామిపల్లిలో శుక్రవారం నిమ్మ, పం డ్ల తోటల్లో పూత నియంత్రణపై రైతులకు అవగా హ నా సదస్సును నిర్వహించారు. ఉద్యానవన శాఖ ఎఒ రాజశేఖర్ , కెవికె శాస్త్రవేత్త ప్రసాద్‌లు మాట్లాడుతూ అంతర పంటల సాగు, భూసారం పెంపు కోసం నవధాన్యాల సాగు గురించి వివరిం చారు. ప్రభుత్వ సబ్సిడీ పథకాల గురించి వారు తెలిపారు. పండ్ల తోటలకు మందులు పిచికారీ చేసే విధానాన్ని ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో విఎఎ పవన్‌కళ్యాణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

## ప్రపంచ మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహనా సదస్సు



**ఆత్మకూరు ,జూన్26,ప్రభాతవార్త:** ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఎం.వి.కృష్ణా రా వు, ఎస్ఐ వై.గౌతం ల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రియదర్శిని కాలేజీ విద్యార్థులతో ర్యాలీ , అవగాహనా సదస్సును నిర్వహించారు. మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంవలన వ్యక్తిగతంగా , కుటుంబపరంగా , సమాజపరంగా కలిగే తీవ్రమైన దుష్పరిణామాలను గురించి వివరించారు. ముఖ్యంగా విద్యార్థి దశలో మాదక ద్రవ్యాల బారిన పడడం వలన విద్యాభ్యాసం దెబ్బతినడం , శారీర,మానసిక ఆరోగ్యం క్షీణించడం , భవిష్యత్తు అవకాశాలను కోల్పోవడం , కుటుంబ ప్రతిష్ట దెబ్బతినడం వంటి అనేక ప్రతికూల ప్రభావాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని , తాముమాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడమే కాకుండా తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, సమాజంలోని ఇతరులకు అవగాహన కల్పించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. అనుమానాస్పద మాదక ద్రవ్యాల కార్యకలాపాలు కన్పిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందజేయాలన్నారు. మాదకద్రవ్యాల తయారీ, నిల్వ, రవాణా విక్రయం, కొనుగోలు, వినియోగం వంటి నేరాలపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ 1985 ప్రకారం అమలులో ఉన్న కఠినమైన శిక్షలు, చట్టపరమైన చర్యలు, వాటివలన కలిగే శాశ్వత పరిణామాల గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. ఒకసారి డ్రగ్స్ వ్యసనానికి లోనైతే వ్యక్తి జీవితమే కాకుండా కుటుంబం, సమాజం కూఆ తీవ్రంగా నష్టపోతామన్నారు. ప్రతి విద్యార్థి మాదక ద్రవ్యాలకు నో చెప్పాలని, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరచుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచి స్తూ , డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రతిజ్ఞ చేయిం చారు. ఈకార్యక్రమంలో ప్రియదర్శిని కాలేజీ విద్యార్థులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంకమ్మ తల్లి 15వ వార్షికోత్సవ వేడుకలు



**విడవలూరు, జూన్ 26 ప్రభాతవార్త:** విడవలూరు మండల కేంద్రంలోని గ్రామదేవత శ్రీ అంకమ్మ తల్లి 15వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు నవగ్రహ మండపారాధన, ప్రత్యేక హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేటకు చెందిన డాక్టర్ కె. సాయిబాబా, డాక్టర్ మస్తానమ్మ దంపతులు విరాళదాతలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు చిట్టేటి మధు, సుధీర్, పెర్నీటి శ్రీనివాస శర్మ, కొర్నాగిరి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు, భజన బృందం సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. వేడుకలు భక్తి పారవశ్య వాతావరణంలో వైభవంగా జరిగాయి.

## సంగం బ్యారేజి వద్ద గట్టి బందోబస్తు




**సంగం జూన్ 26 ప్రభాత వార్త :** రొట్టెల పండుగ పురస్కరించుకొని నెల్లూరుకి పెద్ద ఎత్తున యాత్రికులు వస్తుం టారు. కొంతమంది సంగం వద్ద నీటిని చూసి నదిలో దిగేందుకు ప్రయత్ని ంచి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. గతంలో సంగం ఆనకట్ట వద్ద, రాంపు ( గాంధీజనసంఘం ) వద్ద అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ఈవిష యాన్ని ముందుగానే గుర్తించిన సంగం సిఐ శ్రీనివాసులు రెడ్డి, సంగం ఎస్ఐ భోజ్యానాయక్ బ్యారేజి పరిసర ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రెవిన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖ సమన్వయంతో వ్యవహారించి యాత్రికులు నదిలో దిగకుండా పూర్తి స్ధాయిలో జాగ్రత్తలు తీసుకోనేవిధంగా ఏర్పాటు చేశారు. సిఐ శ్రీనివాసులురెడ్డి బ్యారేజి వద్ద, ఆనకట్ట వద్ద కూడా పరిస్ధితులను పూర్తిగా పరిశీలించారు.

## రొట్టెల పండుగకు పటిష్ట భద్రత

**– 100 మంది పోలీసులతో విస్తృత బందోబస్తు – రైల్వే డీఎస్పీ జి. మురళీధర్**



**నెల్లూరు క్రైమ్, జూన్ 26, ప్రభాతవార్త :** నెల్లూరులో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న ఖిరొట్టెల పండుగఖికు భక్తులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో, రైల్వే ప్రయాణికుల భద్రత కోసం రైల్వే పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. రైల్వే డీఎస్పీ జి. మురళీధర్ పర్యవేక్షణలో, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ. సుధాకర్ నాయకత్వంలో 100 మందికి పైగా సిబ్బంది బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌తో పాటు వేదాయపాలెం, నెల్లూరు సౌత్, వెంకటాచలం స్టేషన్లలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక గస్తీ బృందాలను రంగంలోకి దించారు. తోపులాటలను నివారించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం ఈ బృందాల ప్రధాన లక్ష్యమని డీఎస్పీ తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ప్రధాన స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని, మార్గనిర్దేశాన్ని ఇక్కడ సిబ్బంది అందిస్తున్నారు. స్టేషన్లలో రాకపోకల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లను మాత్రమే ఉపయోగించాలిలని, విలువైన వస్తువులను వెంట తెచ్చుకోకపోవడం ఉత్తమం. తమ లగేజీని ఎప్పుడూ అప్రమత్తంగా కాపాడుకోవాలని సూచించారు. రైల్వే ఆవరణలో అనుమానాస్పద వ్యక్తులు లేదా యజమాని లేని వస్తువులు కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీసులకు లేదా హెల్ప్ డెస్క్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రశాంతమైన, సురక్షితమైన ప్రయాణానికి ప్రయాణికులందరూ భద్రతా నిబంధనలను పాటిస్తూ రైల్వే పోలీసులకు సహకరించాలని డీఎస్పీ జి. మురళీధర్ విజ్ఞప్తి చేశారు.

## మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**– నషా ముక్త్ భారత్ సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పిలుపు**




**నెల్లూరు క్రైం, జూన్ 26, ప్రభాతవార్త :** మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 17 నుంచి 26 వరకు నిర్వహించిన నషా ముక్త్ భారత్ సప్తాహ్ – 2026 కార్యక్రమాల ముగింపు సందర్భంగా శుక్రవారం నెల్లూరు టౌన్ హాల్‌లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా అబ్కారీ శాఖ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖల సంయుక్త సహకారంతో విద్యార్థుల కోసం మెగా డ్రగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ – వికసిత్ భారత్‌కి పహచాన్ లక్ష్యంతో డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. డ్రగ్స్ దుర్వినియోగం, అక్రమ రవాణా రెండింటినీ సమర్థంగా అరికట్టడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలు, వినియోగంపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. డ్రగ్స్‌కు బానిసైతే ఆరోగ్యం, విద్య, ఉద్యోగ అవకాశాలు, కుటుంబ జీవితం, సమాజంలో గౌరవం, వ్యక్తిగత భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదైతే పాస్‌పోర్ట్, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని, ఇటువంటి కేసుల్లో న్యాయవ్యవస్థ కూడా కఠినంగా వ్యవహరిస్తుందని విద్యార్థులకు వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసుల్లో 292 మంది నిందితులను అరెస్టు చేసి, వారిపై రౌడీ, హిస్టరీ షీట్లు తెరిచినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నెల్లూరు టౌన్ ఏఎస్పీ దీక్ష మాట్లాడుతూ గంజాయి నిర్మూలన కోసం పట్టణంలో విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ అలవాటు నుంచి బయటపడేందుకు కౌన్సెలింగ్, డీఅడిక్షన్, రీహాబిలిటేషన్ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ ద్వారా నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ అనిత్ కుమార్ రాజా డ్రగ్స్ వద్దు – చదువు ముద్దు అనే అంశంపై ప్రసంగించి, హాజరైన వారందరితో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఆయన చొరవను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు జాతీయ డీఅడిక్షన్ హెల్ప్‌లైన్ 14446కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసుల నాయుడు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ అయూబ్ అలీ, ఆర్ఐఓ వరప్రసాద్, పోలీసు, అబ్కారీ శాఖల అధికారులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ జెండాతో పోలయ్యకు ఘన నివాళి

**– ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాళులు, కుటుంబ సభ్యులకు పరామర్శ**



**తోటపల్లి గూడూరు, జూన్ 26, ప్రభాతవార్త :** తోటపల్లి గూడూరు మండలం చిన్నచెరుకూరు గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ కార్యకర్త, మాజీ సర్పంచ్ చెరుకూరు పోలయ్య (80) అనారోగ్యంతో గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలుసుకున్న వెంటనే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి చిన్న చెరుకూరులోని ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహంపై తెలుగుదేశం పార్టీ జెండా కప్పి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. పోలయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర పార్టీ కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు కొణతం రఘుబాబు, వరిగొండ సాగునీటి సంఘం అధ్యక్షుడు బొమ్మి కిరణ్, మండల పార్టీ కోశాధికారి తోట శ్రీనివాసులు, తెలుగురైతు మండల ప్రధాన కార్యదర్శి నరాల రాంబాబు తదితరులు నివాళులర్పించారు.

## యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా ఎలకర్రి శ్రీనాథ్ నియామకం



**వింజమూరు, జూన్ 26, ప్రభాతవార్త :** భారతీయ జనతా యువమోర్చ (బీజేవైఎం) జిల్లా కార్యదర్శిగా వింజమూ రుకు చెందిన ఎలకర్రి శ్రీనాథ్ నియమి తులయ్యారు. నెల్లూరులో జరిగిన జిల్లా బీజేవైఎం సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సిహెచ్ భరత్ రెడ్డి, బీజేవైఎం జోనల్ ఇంచార్జ్ లెక్కల రాజశేఖర్ రెడ్డి, వింజ మూరు మండల బిజెపి అధ్యక్షులు అంబటి ఈశ్వర్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వింజమూరులోని స్థానిక బిజెపి కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు ఈ సందర్భంగా ఎలకర్రి శ్రీనాథ్ మాట్లాడుతూ ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదములు తెలియ చేశారు. మండల, జిల్లాలో బీజేవైఎం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సంక్షేమ, అభివృద్ధి, కార్య దక్షతను యువతకు చేరు వేసి తద్వారా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరు నాగేశ్వర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ డి నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు మల్లం కొండారెడ్డి, ఎం రామచంద్ర, సీనియర్ నాయకులు గని రమణయ్య, ఎస్. సుధాకర్ రెడ్డి, నూతక్కి భాస్కర్, జిల్లెల్ల తిరుపతయ్య, దాసరి ప్రసాద్, ఎస్వి శ్రీనివాసులు, జిల్లెల్ల శ్రీనివాసులు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్‌వోలు వేగం పెంచాలి..

**గడువులోగా ఎస్ఐఆర్ పూర్తి చేస్తాం: తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి**

**కొడవలూరు, జూన్ 26 ప్రభాతవార్త :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల (ఈఎఫ్‌లు) పంపిణీ వేగంగా కొనసాగుతోందని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి తెలిపారు. మండలంలోని పలు సెక్టార్లలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. అందిన నివేదిక ప్రకారం ఎస్‌ఏ–ఎంపీడీఓ కార్యాలయ పరిధిలో 9,043 మంది ఓటర్లలో 7,100 మందికి ఫారాలు పంపిణీ చేసి 78.5 శాతం పురోగతి సాధించారు. జేఏసీఏ పరిధిలో 7,308 మంది ఓటర్లలో 5,986 మందికి ఫారాలు అందించి 81.9 శాతం పూర్తి చేశారు. ఎస్‌ఏ పరిధిలో 7,355 మంది ఓటర్లలో 5,608 మందికి ఫారాలు పంపిణీ చేసి 76.2 శాతం నమోదు కాగా, ఏఓ–ఎంపీడీఓ కార్యాలయ పరిధిలో 9,201 మంది ఓటర్లలో 7,208 మందికి ఫారాలు అందించి 78.3 శాతం పురోగతి నమోదైంది. ఏ ఎస్ ఓ కొడవలూరు తహశీల్దార్ కార్యాలయ పరిధిలో 6,988 మంది ఓటర్లలో 5,618 మందికి ఫారాలు పంపిణీ చేసి 80.4 శాతం పూర్తైంది. పంపిణీ చేసిన ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ కూడా సమాంతరంగా కొనసాగుతోందని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి తెలిపారు. మిగిలిన ఓటర్లకు త్వరితగతిన ఫారాలు అందించి, నిర్ణీత గడువులో ప్రక్రియ పూర్తి చేయాలని సంబంధిత అధికారులు బీఎల్‌వోలకు సూచించినట్లు ఆమె వెల్లడించారు.

## ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిని కలిసిన సంపూర్ణమ్మ



**విడవలూరు, జూన్ 26 ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గ జిల్లా మహిళా విభాగ కార్యదర్శి వడ్డే సంపూర్ణమ్మ శుక్రవారం నెల్లూరులో ఎమ్మెల్సీ, నెల్లూరు సిటీ ఇన్చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో, సుఖసం తోషాలతో వర్ధిల్లాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిం చాలని ఆకాంక్షించారు. అనంతరం కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడారు.

## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రారంభం



**వింజమూరు, జూన్ 26, ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలో ఎన్యుమరేషన్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. 163వ పోలింగ్ బూత్ పరిధిలో స్థానిక బంగ్లా సెంటర్‌లోని వ్యాపారి భైరబోయిన బాలయ్యకు తొలి ఎన్యుమరేషన్ ఫారం అందజేశారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బంది కృష్ణాంజలి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఏలు కలిసి బాలయ్యకు ఫారం అందించారు. ఈ సందర్భంగా ఫారంలోని వివరాలను ఎలా పూర్తి చేయాలో, ఏ విధంగా నింపాలో అధికారులు వివరించారు. ఫారంలో ఉన్న అన్ని అంశాలను జాగ్రత్తగా చదివి, సరైన వివరాలతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి వెంకటేశ్వర్లు భూమిరెడ్డి పెంచల్ రెడ్డి భోగిరెడ్డి వెంకటరమణా రెడ్డి ఆరికొండ శ్రీనివాసులు, నీలం పెరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వయోజనుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



**వింజమూరు, జూన్ 26, ప్రభాతవార్త:** అర్హత కలిగిన ప్రతి వయోజనుడు ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని వింజమూరు ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత పవిత్రమైనదని ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. శుక్రవారం స్థానిక బంగ్లా సెంటర్ వద్ద డిప్యూటీ ఎంపీడీవో కె. రామారావు, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్‌తో కలిసి ఓటర్ నమోదు ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటే మన భవిష్యత్తును నిర్ణయించే ఆయుధమని, అర్హత ఉన్నా ఓటు లేకపోతే ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే అవకాశం ఉందని వివరించారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఓటర్ నమోదు కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపు అప్లికేషన్ సమర్పించాలని కోరారు. ఆధార్ కార్డు, నివాస ధృవీకరణ పత్రాలతో ఫారం పూర్తి చేసి సచివాలయంలో లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటింటికి వెళ్తున్న బీఎల్ఓ సిబ్బందికి సహకరించి వివరాలు అందించాలన్నారు. ఒక్క ఓటు కూడా వృథా కాకుండా 100 శాతం ఓటర్ నమోదు లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి వెంకటేశ్వర్లు చౌదరి, ఆరికొండ శ్రీనివాసులు, నీలం పెరుమాళ్ళు బండి చెంచయ్య, భైరబోయిన మల్లికార్జున రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ఓటు హక్కుపై గ్రామస్తుల్లో అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంపిణీ చేశారు.

## ఆత్మకూరులో ఘనంగా మంత్రి ఆనం వారసుని జన్మదిన వేడుకలు



**ఆత్మకూరు, జూన్26, ప్రభాతవార్త:** రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి మనుమడు, బద్వేల్ మాజీ మంత్రి వీరారెడ్డి మునిమనుమడు , ఆనం కుమార్తె లీలా కైవల్యా రెడ్డి – కొండ్రెడ్డి రితీష్‌రెడ్డి ల కుమారుడు కొండ్రెడ్డి సౌరీస్‌వీరారెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆత్మకూరు పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పార్టీ యువ నేత నెల్లూరు శివారెడ్డి, టిడిపి నాయకుల ఆధ్వర్యంలో నేతలు ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఉదయగిరి సుధాకర్, పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు తోట సందీప్, ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మొదట దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం భారీ కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బాణాసంచా కాల్చి స్వీట్లు కేకు పంచిన అనంతరం సుమారు వెయ్యిమందికి అన్నా క్యాంటీన్‌లో పూర్తిగా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయగిరి సుధాకర్, తోట సందీప్, బి.ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఆత్మకూరు అభివృద్ధి, ఆత్మకూరు శ్రేయస్సు కాంక్షించే ఆనం రామనారాయణరెడ్డి వారసులు ఎంతో సంతోషంగా ఉండఆలని కోరుతున్నామన్నారు. ఈజన్మదినం వేడుకల కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు చింతా సునీల్, చింతా మనోజ్, బొగ్గవరపు మహేంద్ర, శ్రీనాథ్, చంద్రబాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. కేక్ కటింగ్ నిర్వహించిన అనంతరం అన్న క్యాంటీన్‌లో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ప్రజలందరికీ తపాలా సేవలు అందేలా చూడాలి



**అనుమసముద్రంపేట, జూన్26, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలంలోని గుంపర్లపాడు పోస్టాపీసులో ఆత్మ కూరు సబ్‌డివిజన్ సహాయ సూపర్నెంట్ పి.మదన మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్నెంట్ మదన్‌మోహన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు తపాలా శాఖ అందిస్తున్న పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ ఖాతాలు, గ్రామీణ తపాలా జీవిత భీమా పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రజలకు ఈ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించి ఎక్కువ మంది లబ్ధిదారులను చేర్చాలని ఆదేశించారు. ప్రస్తుతం డిజిటల్ యుగానికి అనుగుణంగా నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా డిజిటల్ ఖాతాలను ప్రారంభించే విధానం, తపాలా జీవిత భీమా ప్రీమియంలను ఆన్‌లైన్‌లో సులభంగా చెల్లించేవిధానాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు వేగవంతమైన , నాణ్యమైన , పారదర్శకమైన తపాలా సేవలు అందేలా ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేయాలన్నారు. ఈసమావేశంలో గుంపర్లపాడు పోస్టుమాస్టర్ బి.వి.రమణయ్య, పోస్టల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఇతర తపాలా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ..కేవైసీకి త్వరపడండి గ్యాస్ వినియోగదారులకు ఈనెల 30 వరకే గడువు

**కోట, జూన్ 26 ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా ఉన్న ఎల్‌పీజీ వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థలు కీలక ఆదేశాల జారీ చేశాయి. గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి అక్రమాలు ఆరికటేందుకు ,అర్హులైన వారికే సబ్సిడి అందించేందుకు చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియ ఈనెల 30 తేదీగా నిర్ణయించారు. గడువులోగా ఈకేవైసీ పూర్తి చేయని వారికి గ్యాస్ రాయితీ నిలిచిపోవడమే కాకుండా బ్లాక్ అయ్యే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఒక్క సారి కూడా ఈకేవైసీ పూర్తి చేయని ప్రతి గ్యాస్ వినియోగదారుడు (ఇండియన్, హెచ్‌పి, భారత్ ఉజ్వల) పూర్తి చేయాలి. ఇప్పటికే గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి బయోమెట్రిక్ ఇచ్చి ఉంటే లేదా యాప్ ద్వారా కేవైసీ పూర్తి చేసి ఉంటే మళ్లీ చేయాల్సిన అవసరం లేదు.

## 28 న పల్స్ పోలియో

**కోట, జూన్ 26 ప్రభాతవార్త :** ఈనెల 28 న నిర్వహించనున్న పోలియో కార్యక్రమంలో 1.. 5 సంవత్సరాల పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని చిట్టేడు ఆరోగ్య ఉప కేంద్రం డాక్టర్ నాగరాజు తెలిపారు. మండల పరిదిలోని 2800 చిన్నారులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కోసం ర్యాలీలు ,ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

## నిబంధనలకు పాతర.. వీఆర్‌ఏలతో వెట్టిచాకిరీ!

**: మండల కార్యాలయాలకే పరిమితం చేస్తున్న వైనం: అధికారుల తీరుపై వ్యక్తమవుతున్న విమర్శలు**

**: ప్రమాదంలో ప్రాణాలతో పోరాడుతున్న వీఆర్‌ఏ.. న్యాయం చేయాలంటున్న కుటుంబం**

**విడవలూరు, జూన్ 26 ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ, క్షేత్రస్థాయిలో సేవలు అందించాల్సిన గ్రామ రెవెన్యూ సహాయకులను (వీఆర్‌ఏ) మండల కార్యాలయాలకే పరిమితం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో విధులు నిర్వహించాల్సిన వీఆర్‌ఏలను కార్యాలయాల్లో వివిధ పనులకు వినియోగించడం వల్ల ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

**: క్షేత్రస్థాయిలో శూన్యం.. కార్యాలయాల్లోనే విధులు** ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీఆర్‌ఏలు ఆయా గ్రామాల్లో వీఆర్వోలకు సహాయకులుగా పనిచేస్తూ రెవెన్యూ సంబంధిత సేవలు అందించాలి. అయితే విడవలూరు మండలంలో పలువురు వీఆర్‌ఏలు కార్యాలయాలకే పరిమితమయ్యారని సమాచారం. దీంతో గ్రామాల్లో పనులు దెబ్బతింటుండగా, వీఆర్వోలు ఇతర వ్యక్తులతో పనులు చేయించుకోవడం లేదా ఇతర గ్రామాల వీఆర్‌ఏలను పిలిపించుకుని విధులు నిర్వహించడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వీఆర్‌ఏలను తరచూ ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి మార్చుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

**: ఒకరి పని మరొకరితో.. చివరికి ప్రమాదం**

గత కొద్ది రోజులుగా గ్రామాల్లో ఉండాల్సిన వీఆర్‌ఏలను మండల కార్యాలయాల్లోనే వివిధ పనులకు వినియోగిస్తున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో వావిళ్ల గ్రామానికి చెందిన వీఆర్‌ఏ వెంకటేశ్వర్లు అధికారుల పనుల నిమిత్తం వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చావుబతుకుల మధ్య పోరాడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**: కుటుంబం వీధిన.. న్యాయం ఎప్పుడు?**

వెంకటేశ్వర్లు కుటుంబానికి ఆయనే ప్రధాన ఆధారం. ప్రమాదం కారణంగా ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని స్థానికులు చెబుతున్నారు. ఒకరు చేయాల్సిన విధులను మరొకరితో చేయించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు కారణమైన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే గాయపడిన వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం, న్యాయ శాఖ నుంచి తగిన ఆర్థిక సాయం, న్యాయం అందించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

**: స్పందించాలని ప్రజల విజ్ఞప్తి**


గ్రామాల్లో ప్రజలకు అందాల్సిన రెవెన్యూ సేవలు దెబ్బతింటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీఆర్‌ఏలను వారి అసలు విధులకు కేటాయించి, ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నారు. నూతన తహశీల్దార్ ఎ. లక్ష్మీప్రసన్న ఈ వ్యవహారంపై దృష్టి సారించి, సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వావిళ్ల వీఆర్‌ఏ వెంకటేశ్వర్లు ప్రమాద ఘటన, అధికారుల విధుల నిర్వహణ తీరుపై ప్రస్తుతం విడవలూరు మండలంలో విస్తృత చర్చ జరుగు తోంది.

## పీర్ల చావడి వద్ద అన్నదానం



**బిట్రగుంట జూన్ 26 ప్రభాతవార్త :** ఇబ్రహీంపేట మదీనా వెల్డింగ్ షాప్ యజమాని ఎస్.కె హమీద్ ఆధ్వర్యంలో మొహరం సందర్భంగా శుక్రవారం పేదలకు అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎంఆర్ యువసేన అధ్యక్షులు సమీఉల్లా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మదీనా వెల్డింగ్ యుషాప్ యజమాని హమీద్ గత పది సంవత్సరాల నుంచి పేదలకు అన్నదానం చేయడం జరుగుతుందని పేదలకు అన్నదానం చేసిన హమీద్ కు కుటుంబ సభ్యులకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ భాషా నయీం ఇబ్రహీం హుస్సేన్ మహీం సుజిత్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మొహరం పూజలు

**కోవూరు, జూన్26 ప్రభాతవార్త :** కోవూరులోని బజార్ సెంటర్‌లో ఉన్న పీర్ల చావిడి వద్ద శుక్రవారం మొహరం పర్వదినం సందర్భంగా తెల్లవారుజాము నుంచే నిప్పుల గుండం తొక్కేందుకు ముస్లిం యువత పెత్త ఎత్తున ఆ ప్రాంతానికి చేరుకున్నారు. దేవుని పేరు స్మరిస్తూ ఈ నిప్పుల గుండంలో యువత పరుగులు తీశారు. అనంతరం పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన పీర్ల వద్ద ముతావర్లు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ముస్లిం కుటుంబ సభ్యులు పెద్దఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమం మరింత వేగవంతం కావాలి



**కోవూరు, జూన్26 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని శుక్రవారం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపడుతున్న బీఎల్‌వోల పనితీరుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించి ఓటర్ల ఇంటికి వెళ్లి ఎలక్షన్ ఫారాలను వారికి అందించి వారి దగ్గర నుంచి పూర్తి సమాచారం రాబట్టాలన్నారు. దీనికి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, బీఎల్‌వోలు ఉన్నారు.

## వైభవంగా ధ్వజారోహణ




**కోవూరు, జూన్26 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. అనంతరం కొడిముద్దల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఉదండి కార్తీక్ జ్ఞాపకార్థం ముత్యాల హేమంత్‌కుమార్, ప్రగతి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శివభక్త బృందం సభ్యులు, తదితరులు ఉన్నారు.

## జనతా వారధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**కావలి, జూన్ 26 ప్రభాతవార్త :** బిజెపి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జనతా వారధిని కావలి డివిజన్‌పరిదిలోని ప్రజలు పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు, కావలి డివిజన్ జనతా వారధి ఇన్‌చార్జ్ కుట్టుబోయిన బ్రహ్మానందం పిలుపునిచ్చారు. శుక్రవారం బిజెపి కార్యాలయంలో ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి ఉదయగిరి, కోవూరు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజలకు ప్రభుత్వానికి ఓ వారధిలా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలపై విన్నవించిన వినతులను సోమవారం ప్రజా విజ్ఞప్తుల వేదిక కార్యక్రమంలో ఉన్నతాధికారులకు అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చేపడుతామన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యఓఉలు పివిఎన్.మాదవ్, జిల్లా అధ్యక్షులు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి పిలుపుతో ఈ వారది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అద్యక్షుడు మంద కిరణ్‌కుమార్, రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు వింత వెంకటరంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పూనూరు మాదవిరెడ్డి, సీనియర్ నాయకుడు వాయుగుండ్ల వెంకటసుధీర్, జలదంకి ఎంపిటిసి కుట్టుబోయిన యాదవ్, యువమెర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి దేవాండ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు 5 గంటల పాటు విద్యుత్ కోత



కోవూరు, జూన్26 ప్రభాతవార్త : కోవూరు మండల పరిధిలోని కోవూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు చేస్తున్న దృష్ట్యా 5 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోవూరు మండల పరిధిలోని కోవూరు పట్టణం, గుమ్మలదిబ్బ పడుగుపాడు, ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరు, మోడేగుంట, చెర్లోపాలెం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం1 గంటల వరకు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. అత్యవసర సేవలు గలవారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన తెలిపారు.









## సరస్వతీ అలంకారంలో శ్రీ ఆత్మారామస్వామి

సంగం జూన్ 26 ప్రభాతవార్త మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ సీతాలక్ష్మణ సమేత ఆత్మ రామస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆత్మరామ స్వామి వారు సరస్వతీదేవి అలంకారంలో హంసవాహనం పైన భక్తులకు దర్శన మిచ్చారు. స్వామి వారిని రంగు రం గుల పూలతో అలంకరించారు. అర్చకులు వేదగిరి సత్యనారాయణ, భరత్ స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణా సంచాను కాల్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలు భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా కొండూరు దిరిశాలయ్య ( లేట్), మరియు వారి కుమా రులు, డేగ వెంకయ్య, సబ్బు చలమయ్య బ్రదర్స్, కీర్తిశేషులు మావిళ్ళ శ్రీనివాసులు అండ్ బ్రదర్స్, పంది చెంచురామయ్య వ్యవహారించారు. అలాగే తిరుచా ఉత్సవానికి చీపినాపి నరసయ్య అండ్ బ్రదర్స్ వ్యవహారించారు.



## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ప్రత్తిపాటి, బొల్లినేని



విింజమూరు, జూన్ 26, ప్రభాతవార్త: కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామా రావుబుధవారం నాగ్‌పూర్‌లోని ఆయన నివాసంలో మ ర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదే శ్‌లో రోడ్లు,జాతీయ రహదారులు,ఇతర మౌలిక సదు పాయాల అభివృద్ధి పనులకు కేంద్ర నిధులు మంజూరు చేయాలని మంత్రి గడ్కరీని కోరారు. రాష్ట్ర ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేయగా, సంబంధిత ప్రతి పాద నలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారురాష్ట్రంలో రోడ్డు కనెక్టివిటీ మెరుగుపడితే వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని ఈ భేటీలో నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## నేడు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రాక




వింజమూరు, జూన్ 26, ప్రభాతవార్త తెలుగు దేశంపార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు, ఆయన తన యుడు తెలుగుదేశం పార్టీ యువనేత బొల్లినేని కార్తీక్ 27వతేది శనివారం మండలంలోని చాకలకొండ గ్రామంలోని కాకర్లమాల్యాద్రి,లక్ష్మిదుర్గ నూతన గృహప్రవేశానికి హాజరవుతారు. తదుపరి బొల్లినేని స్వగృహం కలిగిరి మండలం పెద్ద పాడులో ప్రజలను నేరుగా కలవడం స్థానిక సమస్యలపై చర్చించటం అనంతరం సాయంత్రం కలిగిరి పట్టణంలోని టిడిపి నాయకులు కార్యకర్తలతో సమావేశం అవుతారు. ఆదివారం దుత్తలూరు మండలం టిడిపి సీనియర్ నేత మల్లంపాటి గురవయ్య నాయుడు స్వగృహం నరవాడలో ఆయన తనయుడు వెంగల్ వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. బొల్లినేని ఆయన తనయుడు యువనేత బొల్లినేని కార్తీక్ తో కలిసి సంయుక్త పర్యటన చేస్తున్నందున తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలు వారిని కలిసి పలు అంశాలు చర్చిస్తారని పార్టీ ముఖ్య నేతలు పేర్కొన్నారు.

## గంగమిట్ట రహదారిపై దుర్గంధం

### పాదచారుల ఇక్కట్లు



వింజమూరు, జూన్ 26, ప్రభాత వార్త: వింజమూరు పంచాయతీ పరిధిలోని గంగమిట్ట నుండి నేరేడు పల్లి, లెక్కలవారిపాలెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తూ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. మురుగునీటి కాలువలకు సరైన అవుట్‌లెట్ లేకపోవడం, కాలువలు పూడిపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్డుపై నిలిచి దుర్గంధం వెదజల్లుతుండటంతో చుట్టుపక్కల ఇళ్లలోని వారు కూడా ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు పూడిపోయి నెలలు గడుస్తున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో సమస్య జటిలమైందని చెబుతున్నారు. శానిటరీ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోవడం, పూడిక తీత కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయడమే ఈ పరిస్థితికి కారణమని వారు మండిపడుతున్నారు. మురుగునీటి కారణంగా దోమలు విజృంభించి మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి మురుగునీటి కాలువలను పూడిక తీయించి, సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## నరసింహస్వామి పూజలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రసన్న



కోవూరు, జూన్26 ప్రభాతవార్త : నరసింహ కొండపై వెలసి ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు, కోవూరు నియోజకవర్గ పరిశీలకులు అనిల్‌బాబు, ఏపీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, దేవిరెడ్డి సాయిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఘనంగా పీర్ల పండుగ



మర్రిపాడు ,జూన్26,ప్రభాతవార్త: మండలంలోని నందవరంలో పీర్ల పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆత్మకూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గంగాధర్‌ను గ్రామస్తులు సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. గ్రామ నివాసి ఆర్‌టివి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గయాజ్, మాజీ సర్పంచ్ , తెలు గుదేశం నాయకుడు కోనంకి శ్రీనివాసులునాయుడు , కార్యక్రమ నిర్వాహకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ

### - జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాలు



నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త – కలెక్టరేట్ జిల్లాలో అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాల సమయంలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాలు జారీ చేశారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈ మేరకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టుల పిల్లలకు ప్రవేశాల సమయంలో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లు, యాజమాన్యాలను సూచించారు. అలాగే ఈ ఆదేశాల అమలుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జర్నలిస్టులు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి, వారి కుటుంబాలకు విద్యాపరంగా ఊరటనిచ్చే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని సంబంధిత అధికారులు ఈ ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.


## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: సిఐ బాలకృష్ణ



గూడూరు, జూన్ 26, ప్రభాతవార్త అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు గూడూరు పట్టణంలోని ఆది శంకర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, వాటి నివారణ, యువత పాత్రపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, సమాజంపై కలిగే తీవ్ర దుష్పరిణామాలను వివరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అలాంటి అలవాట్లకు బానిస కాకుండా తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా, తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు తెలిసినట్లయితే వెంటనే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు లేదా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబరు 14405కు సమాచారం అందించాలని తెలిపారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకొని, సమాజాభివృద్ధికి తోడ్పడే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ సిఐ బాలకృష్ణ, గూడూరు ఎస్ఐ శేషమ్మ, వేణుగోపాల్, చెంచయ్య, కుమార్, వీరస్వామి, పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి జన్మదినోత్సవ వేడుకలు

### -రక్తదాన,అన్నదాన, సేవా కార్యక్రమాల నిర్వహణ



నెల్లూరు,జూన్ 26, ప్రభాతవార్త –విద్య వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, తూర్పురాయ లసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను శుక్రవారం ఆ పార్టీ నా యకులు, కార్యకర్తలు, ఆయన అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన, వస్త్రదాన, రక్తదాన వంటి సేవా కార్యక్రమాలను గావించారు. నగరంలోని స్థానిక రాంజీనగర్ లోని వైకాపా నగర కార్యాలయంలో భారీ కేక్‌ను కట్‌చేసి నాయకులు వారి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం రక్తదానశిబిరాన్ని నిర్వహించారు. 105 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల సిబ్బంది ఆద్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో 110 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. పర్వతరెడ్డి లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 66 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు స్వార్ధం లేని రాజకీయ నేతగా అనతి కాలంలోనే మంచి పేరును పర్వతరెడ్డి సాధించారని కొనియాడారు. విద్యాసంస్థల అధినేతగా, ఎమ్మెల్సీగా, వైకాపా నేతగా నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి తోడుగాఉంటున్నారన్నారు. ఆయన భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, పేర్నాటి కోటేశ్వరరెడ్డి, సుధీర్, కార్పోరేటర్ మహేష్, హుస్సేనీ, వేనాటి శ్రీకాంత్, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, శరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం



నెల్లూరు,జూన్ 26, ప్రభాతవార్త –విద్య రొట్టెల పండుగను పురస్కరించుకుని బారాషాహీద్ దర్గాకు చేరుకునే భక్తుల సౌకర్యార్థం నెల్లూరు జిల్లా హోటల్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక దర్గాలో అన్నదా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా జనసేన పార్టీ నేత గునుకుల కిషోర్ పాల్గొన్ని భక్తులకు అన్నదానం గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సర్వమత సామరస్యంగా నిర్వహించే ఈ రొట్టెల పండుగ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటూ నిత్యాన్నదానం చేయటం సంతోష దాయకమన్నారు. ఇతరసేవా సంఘాలు, అసోసియేషన్స్ కూడా వీరిని స్పూర్తిగా తీసుకుని భక్తులకు మరిన్న సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు యాదవ్ కుమార్‌రెడ్డి, వల్లూరి మహేష్, వెంగమాంబ రవి, హర్షద్, ఎస్తాని, జనతా దాబా సుందర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీకి..రామ్ రామ్

### రెండు దశాబ్దాల పథకానికి మరో నాలుగు రోజుల్లో ముగింపు

కోట,జూన్ 26 ప్రభాతవార్త రెండు దశాబ్దాలు గ్రామాలను ఆదుకున్న ఉపాధి హామీ పథకానికి మరో నాలుగు రోజుల్లో కాలం చెల్లిపోనుంది. కొత్తగా అమల్లోకి రానున్న వీబీజీరామ్‌జీ ( వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజవిక మిషన్ )ఉపాధి హామీకి రామ్‌రామ్ పలకనుంది. గ్రామాల్లో దుర్భర పరిస్థితులను ఎదుర్కొని ఇతర ప్రాంతాలకు వలస పోతున్న స్థానికులకు ఉన్న చోటే పనులు కల్పించాలన్న ఉద్దేశ్యంతో కేంద్రం 2006 లో ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఉపాధి శ్రామికులు పొందే వేతన మొత్తంలో 40 శాతం అదనంగా గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేలాయించింది. దీంతో పల్లెల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వమే ఈ పథకం అమలుకు అవసరమైన నిధులు సమకూర్చేలా పదకానికి రూపకల్పన చేశారు.

తిరుపతి నుంచి ఆరంభం : వీబీజీరామ్‌జీ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నా.. రెండు తేదీన ఈ పథకాన్ని రాష్ట్ర స్థాయిలో తిరుపతి జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి హాజరయ్యే అవకాశం ఉన్నట్లు డ్వామా అధికారులు తెలిపారు.

## బారాషహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన విద్యుత్ శాఖ

### సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం




నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త – వైద్యం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన బారాషహీద్ దర్గాలో విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ కె.రాఘవేంద్రం మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాను 24/7 విద్యుత్‌శాఖ ప్రత్యేకస్టాల్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నా మని తెలిపారు. దాదాపు 200 మంది సిబ్బందికి షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించామని, భక్తులకు విద్యుత్ పరంగా ఎటువంటి సమస్యలు వచ్చినా రిసెప్షన్ కౌంటర్ల ద్వారా తెలియజేయవచ్చని సూచించారు. షిఫ్ట్‌ల ప్రకారం విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి నిర్లక్ష్యానికి తావి వ్వకూడదని ఆదేశించారు. ఈ దర్గా మతసామర స్యా నికి,ఐక్యతకు మారుపేరుగా నిలుస్తుందని, అలాగే విద్యుత్ శాఖ సిబ్బంది కూడా కలిసికట్టుగా పనిచేస్తూ ఏ పనినైనా విజయవంతంగా పూర్తి చేయగలరని తెలి పారు. ఎలక్ట్రికల్ సేఫ్టీ టీం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మి నారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుప్రి య, అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మి దర్గా ప్రాంగణంలోని ప్రతి ఒక్క షాప్‌ను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పాటించాలని తెలిపి వైర్లు ఎక్కడ అతుకులు లేకుండా చూడడం జరిగిందన్నారు. దీంతో వారి టీంకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. అలాగే ఇక్కడ విద్యుత్ సంబంధిత అన్ని ఏర్పాట్లను టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్, అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మి నారాయణ పర్యవేక్షణలో ప్రతి దశలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సమగ్రంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ఏర్పాట్లను ఎంతో చక్కగా నిర్వహించిన అధికారులను, సిబ్బందిని ఎస్ఈ అభినందించారు. అదే విధంగా విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు అందరూ మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాం క్షిస్తూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ పూజా కార్యక్రమం జిల్లా ప్రజల శాంతి, సౌభాగ్యం,సర్వమత సామ రస్యానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు లక్ష్మి నారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.

## గాడ్స్ గార్డెన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



కావలి, జూన్ 26 ప్రభాతవార్త : జలదంకి మండలం జమ్మలపాలెం సమీపంలోని హ్యాపీ హోమ్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గాడ్స్ గార్డెన్‌ను శుక్రవారం కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన గార్డెన్‌ను పరిశీలించి ఆహ్లాదకరమైన వా తావరణంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీ లిం చారు. గాడ్స్ గార్జెన్ ఏర్పాటుకు కృషి చేసిన నిర్వాహ కులు పాదార్తి చంద్ర కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రాంగణంలోని వివిధ విభాగాలను సందర్శించి ఏర్పాటుచేసిన వినోద కార్యక్ర మాల్గో పాల్గొని కొంతసేపు సెటిల్, కోడింబిల్ల ఆడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి తటపర్తి రమేష్ టిడిపి నాయకులు, తిరువీది ప్రసాద్, వల్లేరి వెంకట కిరణ్‌కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, గార్డెన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## మరోసారి బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ సీటు

### " ఓసి మహిళకే వచ్చే అవకాశం "



బుచ్చి జూన్ 26 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రస్తుతం బిసి మహిళా కేటగిరి నుండి వచ్చిన మోర్ల సుప్రజా కొనసాగుతున్నారు.రానున్న డిసెంబర్‌కి వీరి పదవి కాలం పూర్తి అవుతుంది., మరో సారి కూడా బుచ్చి మున్సిపాల్టీ ఓసి మహిళకు దక్కనున్నట్లు పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు పెద్ద పీటు వేస్తున్నారు. అందులో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంకి ఓసి మహిళకే దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలో గతంలో 20 వార్డులు ఉండగా వాటిని 28 వార్డులు చేశారు. అందులో 14 మంది మహిళా కౌన్సిలర్లు రాబోతున్నారు. ఈ సారి ఓసి మహిళలకే చైర్‌పర్సన్ సీటు దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ సారి ఓసి మహిళకు కేటాయిస్తే ఆ సీటు ఎవ్వరికి దక్కుతుందో వేచి చూడాలి. ఏది ఏమైనప్పటికి చంద్రబాబు పాలనలో రానున్న మున్సిపల్ ఎన్నికలలో మహిళలకే ప్రాధన్యత ఎక్కువ ఉంటుందని చెప్పవచ్చు.